క్లుప్తంగా

రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశానికి హాజరుకావాలి

తహసీల్దార్ ఎస్‌కే ఎండీ హుస్సేన్



చిలకలూరిపేట: రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ఏర్పాటు కోసం ఈ నెల 20వ తేదీన సాయంత్రం 4 గంటలకు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా రెడ్ క్రాస్ సొసైటీ సేవలు స్తబ్దుగా ఉన్న నేపథ్యంలో నూతన కమిటీ ఏర్పాటు చేసి సేవలు విస్తృతం చేయనున్నట్లు వెల్లడించారు. సభ్యులందరితో కమిటీ ఏర్పాటుపై చర్చించి నిర్ణయించటం జరుగుతుందన్నారు. సమావేశానికి వచ్చే సభ్యులు తమ ఐడెంటిటీ కార్డులు తీసుకురావాలన్నారు. నూతనంగా సభ్యులుగా చేరేవారు సభ్యత్వ రుసుం చెల్లించి చేరవచ్చన్నారు.

వాటర్ ట్యాంకర్ ఎత్తుకెళ్లారు!

యడ్లపాడు: రాత్రికి రాత్రే వాటర్ ట్యాంకర్ మాయమైంది. ఈ ఘటన వంకాయలపాడు పంచాయతీ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉన్నవ గ్రామానికి చెందిన సామినేని శ్రీనివాసరావు వంకాయలపాడు గ్రామంలో 15 ఎకరాల భూమిని కొనుగోలు చేసి వెంచర్ పనులు చేపడుతున్నారు. సోమవారం రాత్రి పనుల అనంతరం వాటర్ ట్యాంకర్‌ను అక్కడే నిలిపి ఉంచారు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూసేసరికి ట్యాంకర్ కనిపించకుండా పోయినట్లు సమాచారం ఇవ్వడంతో మంగళవారం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపారు.

ఎన్ఈసీలో కోడింగ్ ఛాలెంజ్



నరసరావుపేటరూరల్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో 24 గంటల నిరంతర కోడింగ్ ఛాలెంజ్‌ను మంగళవారం పూర్తి చేశారు. ప్రముఖ శిక్షణా సంస్థ డాటా వాలీ సహకారంతో కళాశాల ట్రైనింగ్ అఫ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోడింగ్ ఛాలెంజ్‌లో కళాశాలలోని ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కోడింగ్ చాలెంజ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ డాక్టర్ ఆనంద్ వలివేటి మాట్లాడుతూ కొత్త ఆలోచనలు ప్రోత్సహించేందుకు, విద్యార్థుల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్యాంప్ ఫైర్, మ్యాజికల్ ఈవెంట్స్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ మిట్టపలి కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపలి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వృక్షశాస్త్ర విభాగాధిపతి వేణుమాధవ్‌కు డాక్టరేట్



నరసరావుపేట ఈస్ట్: శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి రాజనాల వేణుమాధవ్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. వర్సిటీ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ కె.మల్లిఖార్జున్ పర్యవేక్షణలో క్వాంటిటేటివ్ స్టడీస్ ఆన్ ఇథనోమెడిసినల్ ప్లాంట్స్ యూజ్‌డ్ బై ట్రైబ్స్ ఆఫ్ పాడేరు డివిజన్, అల్లూరి సీతారామరాజు డిస్ట్రిక్ట్, ఏపీ, అంశంపై వేణుమాధవ్ చేసిన పరిశోధనకు గాను వర్సిటీ డాక్టరేట్ అందించింది. పాడేరు ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు తమ అనారోగ్య సమయంలో వాడే మొక్కలపై పరిశోధనలు చేసి ఆయా మొక్కలలోని ఔషధ గుణాలు, విలువలను వేణుమాధవ్ నిరూపిస్తూ తన పరిశోధన పూర్వక గ్రంథంలో పొందుపరిచారు. వర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న వేణుమాధవ్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, కమిటీ సభ్యులు, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు తోడ్పడాలి

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు తోడ్పడాలని రాష్ట్ర పరిశీలకులు పి.రమేష్ కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపాన ఉన్న సంసిద్ స్కూల్లో జరుగుతున్న జిల్లాస్థాయి ప్రధానోపాధ్యాయులు శిక్షణతరగతులు రెండవ రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శిక్షణతరగతుల్లో అకడమిక్ మోనిటరింగ్ అధికారి పూర్ణచంద్రరావు,ఎంఈవో-2 పుసులూరి లలిత కుమారి, 230 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

17న బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం

- పార్టీ శ్రేణులు తరలిరావాలి
- మాజీ మంత్రి విడదల రజిని పిలుపు



వేదిక ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న ఆమె నివాసంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంపై ముఖ్యనాయకులతో మంగళ వారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు బాబు ష్యూరి టీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని తన నివాస సమీపంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలే పరమావధిగా మహిళలు, దళితులపై అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకునే దిక్కు లేదన్నారు. కూటమి ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని చెప్పారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

కమిటీలు పూర్తి చేయాలి

గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం గ్రామ, వార్డు కమిటీలను సంబంధిత మండల నాయకులు పూర్తిచేయాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ, వార్డులోనూ పార్టీ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో నిర్వహించేందుకు ఈ కమిటీలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, చిలకలూరిపేట,నాదెండ్ల, యడ్లపాడు మండలాల అధ్యక్షులు షేక్ దరియావలి, దేవినేని శంకరరావు, మంగు ఏడుకొండలు, వడ్డేపల్లి నరసింహరావు, పార్టీ యువ జన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, జిల్లా నాయకులు కంజుల వీరారెడ్డి, వలేటి వెంకటేశ్వరరావు, పఠాన్ తలహాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న వృక్షరాజాలు!!



ప్రకాష్‌నగర్ రిజిస్ట్రార్ కార్యాలయ రోడ్డులో పెద్దచెట్టును నరుకుతున్న కూలీలు



గత శనివారం రోజున చెట్లు నరికిన విద్యుత్ సిబ్బంది

వివిధ కారణాలతో ఏపుగా పెరిగిన చెట్లు నరికివేత

నరసరావుపేట: చెట్టునురా / కొట్టకురా / అమ్మకురా / అమ్మనురా.. అని ఓ కవి పలుకులు. 'ఉడతను పెంచితే పారిపోయింది.. పక్షిని పెంచితే ఎగిరిపోయింది.. కానీ చెట్టుని నాటి పెంచితే అవి రెండూ చెట్టు పైకి చేరిహాయిగా సేదతీరుతున్నాయి' అని పెద్దలు సరదాగా చెబుతారు. కానీ నరసరావుపేట పట్ట ణంలో జరుగుతోంది వేరు. అసలు 'చెట్లకు ఇవ్వడమే తెలుసు... అది నీడైనా, ఫలమైనా'. అందుకే చెట్లను దూరంగా నాటినా అవి పెరిగే కొద్దీ దగ్గర అవుతాయి. అదే మనిషి పెరుగుతూ ఇంకొకరికి 'దూరం అవుతున్నాడని' సరదాగా చెబుతారు. చక్కగా నీడనిచ్చే చెట్లపై కొందరు నగర వాసులు కన్నెర్ర చేస్తున్నారు. 'చెట్టులా బతకడం మనిషికి అసాధ్యం... ఎందుకంటే శిశిరంలో ఆకులన్నీ రాలిపోయినా మళ్లీ వసంతంలో ఎలా చిగురించి నెగ్గుకు రావాలో వాటికి తెలిసినంతగా మనిషికి ఎప్పటికీ తెలియదని' పెద్దలు చెబుతారు. కానీ నరసరావుపేటలో జరుగుతోంది వేరు. పచ్చని చెట్లు వివిధ కారణాలతో తెల్లవారేటప్పటికి అదృశ్యమౌతున్నాయి. ఒకవైపు విద్యుత్ తీగెలకు తగులుతున్నాయనే కారణంతో ఆ శాఖ సిబ్బంది నిర్దాక్షిణ్యంగా కొమ్మలు, అలవికాకపోతే సమూలంగా చెట్ల మొదళ్లనే నరికివేస్తుంటే... తమ ఇళ్లకు అడ్డం వస్తున్నాయని, ఇళ్లకు నష్టం చేకూర్చుతున్నాయనే కారణంతో ఇళ్ల యజమానులు చెట్లను కర్కశంగా నరికించేస్తున్నారు. మంగళవారం ప్రకాష్‌నగర్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డులో సుమారు పాతికేళ్ల వయస్సుకు పైగా ఉన్న ఓ చెట్టును ఓ చిన్న కారణంతో కూలీలతో పచ్చని చెట్టును ముక్కలు చేసి లారీల సహాయంతో తరలించారు.

దీనిపై మున్సిపల్ డీఈ మహమద్ రఫీ మాట్లాడుతూ సదరు ఇంటి గోడలోకి చెట్టు వేళ్లు ప్రవేశించి గోడ పగుళ్లకు కారణమౌతుందనే ఉద్దేశ్యంతో ఆ ఇంటి యజమాని తమను సంప్రదించకుండానే చెట్టును నరికించేశాడన్నారు. తమకు సమాచారం రావటంతో వెళ్లి ఆ ప్రదేశాన్ని చూసి ఇంటి యజమానితో మాట్లాడామని, ఆ చెట్టు తొలగించినందుకు పురపాలక సంఘానికి తగిన జరిమానా చెల్లించేందుకు ఆ ఇంటి యజమాని అంగీకరించారన్నారు. ఏదిఏమైనా వృక్షరాజాలను నేలరాల్చడంపై పలువురు విమర్శలకు తావిస్తున్నారు.

చేప ముల్లు తొలగించి... ప్రాణాపాయం తప్పించి..



నరసరావుపేట: గొంతులో చేప ముల్లు గుచ్చుకోవటంతో తీవ్రమైన నొప్పి, వాపు, మింగుడుపడని ఇద్దరు పేషెంట్లకు ఎండోస్కోపీ విధానంతో ఆ చేప ముళ్లు తొలగించినట్లు అశ్వూర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ యండమూరి నిఖిలేష్ మంగళవారం వెల్లడించారు. క్రోసూరుకు చెందిన 38ఏళ్ల షేక్ ఆషా, నూజెండ్లకు చెందిన 32ఏళ్ల బంగారు రాజు చేప ముళ్లు గొంతులో గుచ్చుకొని అడ్డంపడి తీవ్రమైన బాధతో తమను సంప్రదించారన్నారు. ఎండోస్కోపీ ద్వారా గొంతులో అవి ఎక్కడ ఉన్నాయో కనుగొని చాకచక్యంగా రెండు నిమిషాల వ్యవధిలో అత్యాధునిక పరికరాలు వాడి ఎటువంటి నొప్పి లేకుండా తొలగించామన్నారు. ఆలస్యమైతే పేగుకు రంధ్రం ఏర్పడి ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉండేదన్నారు. ఇటువంటి సందర్భాల్లో వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. తమ హాస్పిటల్‌లో పిల్లలు నాణాలు, పిన్నులు మింగితే వెంటనే ఎండోస్కోపీ ద్వారా తీయబడతాయని పేర్కొన్నారు.

సొసైటీలకు త్రీమెన్ కమిటీల నియామకం

నాదెండ్ల: గణపవరం, నాదెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రీమెన్ కమిటీలను ప్రభుత్వం నియమించింది. గణపవరం త్రీమెన్ కమిటీ ఛైర్మన్‌గా పెంటేల శేషగిరిరావు (గణపవరం), డైరెక్టర్లుగా పూర్ణె హరిబాబు (ఇర్లపాడు), యామిని ధర్మారావు (అప్పాపురం) నియమితులయ్యారు. నాదెండ్ల త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా నల్లమోతు హరిబాబు (నాదెండ్ల) డైరెక్టర్లుగా బత్తుల లక్ష్మారెడ్డి (జంగాలపల్లె), చట్టాల చెంచు ఆంజనేయులు (బుక్కాపురం) నియమితులయ్యారు. త్వరలో ఆయా సొసైటీల్లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

శావల్యాపురంలో..

శావల్యాపురం: మండలంలోని కారుమంచి సొసైటీలకు నూతన చైర్మన్లు, డైరెక్టర్లు నియామకమైనట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు జిల్లా సహకార అధికారి యం.నాగరాజు తెలిపారు. శావల్యాపురం సొసైటీ చైర్మన్‌గా గడుపూడి విశ్వనాథం, డైరెక్టర్లు గోనుగుంట్ల నాగరాజు, బండారు వీరాంజనేయులు, కారుమంచి సొసైటీ అధ్యక్షులుగా గోపాలం శివప్రసాదు, డైరెక్టర్లు గద్దె వీరమస్తాన్ రావు, దారా రామకోటమ్మలు నియమించినట్లు తెలిపారు. కొద్ది రోజుల వ్యవధిలో నూతన కార్యవర్గం బాధ్యతలు తీసుకుంటారన్నారు.

న్యాయమైన సమస్యలు.. పరిష్కరించండి

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వాన్ని కోరిన సీపీఎం, కార్మిక సంఘ నాయకులు



మాట్లాడుతున్న గుంటూరు విజయకుమార్

నరసరావుపేట: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారానికి మూడవ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయంకు ఎదురుగా నిర్వహిస్తున్న సమ్మె శిబిరానికి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయరాజు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలుపుతూ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సమ్మె విజయవంతం కావడానికి తమ సంఘం తరపున కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎమ్మెల్యే వినతి పత్రాలు ఇవ్వాలనే పిలుపులో భాగంగా గుంటూరు రోడ్డులోని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు కార్యాలయం వరకు కార్మికులు ప్రదర్శనగా వెళ్లి వారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ న్యాయమైన మీ డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్, చిన్న అల్లాభక్షు, ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్లకు సాకారమైన యడ్లపాడు వాసుల కల

- రూ.90 వేలతో ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు
- తెలంగాణ నుంచి వచ్చి దేవాలయభివృద్ధికి తోడ్పాటు అందించిన దాతలు



ఇత్తడి తొడుగు చేయించి పూజలు చేస్తున్న దాతలు డాక్టర్ దంపతులు

యడ్లపాడు: గ్రామస్తుల ఎనిమిదేళ్ల కల ఎట్టకేలకు నెరవేరింది. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌లోని కలివరం గ్రామానికి చెందిన డాక్టర్ కత్తుల సాంబశివరావు ధనలక్ష్మి దంపతులు, వారి కుమారులు లక్ష్మణకుమార్, రమణ కుమార్ ఇచ్చిన భారీ విరాళంతో శ్రీ అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగును ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే డాక్టర్ సాంబశివరావు కుటుంబం, చెంఘీజ్‌ఖాన్ పేటలోని ఆలయాన్ని సందర్శించినప్పుడు ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు లేకపోవడాన్ని గమనించి చలించిపోయారు. గ్రామస్తుల కోరికను తెలుసుకుని ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని నిర్ణయించుకున్నారు. సుమారు రూ. 90 వేలు వెచ్చించి ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగుతో పాటు, అమ్మవారికి, గణపతిస్వామికి మకర తోరణాలు, ఇత్తడి కలశాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక సేవలు జీవితానికి ప్రశాంతతను అందిస్తాయని, మనుషుల పట్ల ప్రేమాభిమానాలను పెంచుతాయని చెప్పారు. దాతలు వారం రోజుల పాటు ఆలయంలో ఉండి ఈ పనులను పర్యవేక్షించి పూర్తి చేశారు.

గతంలో కూడా వీరి కుటుంబం ఆలయ గోశాలలోని గోవులకు భారీగా గ్రాసాన్ని అందించినట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు. ఆలయ సమస్యను తెలుసుకుని వెంటనే స్పందించిన దాతలకు ధర్మకర్త సాంబశివరావు, గ్రామపెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాతల కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించి సత్కరించారు.

గణపవరంలో బస్‌షెల్టర్ ప్రారంభం



డాక్టర్ రామకృష్ణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో జాతీయ రహదారి పక్కనే నిర్మించిన బస్‌షెల్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పల్నాడు జిల్లా టీడీపీ ఇన్‌చార్జి కొమ్మాలపాటి శ్రీధర్‌లు ప్రారంభించారు. చిలకలూరిపేట ఆర్‌కే హాస్పిటల్స్ వైద్యుడు చాపలమడుగు రామకృష్ణ అందించిన ఆర్థికసాయం, గ్రామస్తుల సహకారంతో రూ.6.5 లక్షల వ్యయంతో నిర్మించిన బస్‌షెల్టర్‌తో ప్రయాణికులకు ఎంతో సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలను శాలువాలతో సత్కరించారు. అనంతరం గ్రంథాలయం పక్కనే ఉన్న సుజల స్రవంతి ప్లాంట్‌ను ప్రారంభించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో ధనలక్ష్మీ గ్రూపు సంస్థల కార్యదర్శి పేర్ని వీరనారాయణ, ఆర్టీసీ నెల్లూరు జోన్ ఈడీ జి.నాగేంద్రప్రసాద్, భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కెల్లంపల్లి అచ్చయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, కంచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటాం

వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్ మధిరే సైదా



డాక్టర్ గోపిరెడ్డిని సన్మానించిన మధిరేసైదా

నరసరావుపేట: రాబోయే ఎన్నికల్లో వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటామని, డాక్టర్ గోపిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఎగ్జిక్యూటివ్ నెంబర్ షేక్ మధిరే సైదా వెల్లడించారు. మంగళవారం గుంటూరురోడ్డులోని పార్టీ కార్యాలయంలో తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని తన అనుమాయలతో కలిసి శాలువా కప్పి పూలమాలలు వేసి సత్కరించి కృతజ్ఞతలు తెలియచేశారు. రానున్న రోజుల్లో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఆయన వెల్లడించారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షులు తన్నీరు శ్రీనివాసరావు, గ్రామనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమయపాలనతో విధులు నిర్వహించాలి

అధికారులు, కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులకు కమిషనర్ సూచన



మాట్లాడుతున్న కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట: పారిశుద్ధ్య కార్మికులు సమయ పాలన పాటిస్తూ ఆప్రాన్, టీ షర్టులు ధరించి విధులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ అతిథి గృహంలో వార్డు పర్యావరణ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్మికుడు ప్రతిరోజూ మస్టర్‌కు హాజరై ఉదయం 5.30 నుంచి 10.30 వరకు, మధ్యాహ్నం రెండు నుంచి ఐదుగంటల వరకు పనిచేసే విధంగా చూడాలని కోరారు. ప్రధాన అంతర్గత రహదారుల్లో ఊడ్పులు నిర్వహించాలని, రోడ్డు మార్జిన్‌లలో చెత్తాచెదారం తొలగించాలని, ప్రజలతో నిత్యం మమేకమై వంద శాతం పట్టణంలో పారిశుద్ధ్యం నిర్వహించాలన్నారు. వాణిజ్య, వ్యాపార, వర్తక సంఘాలు నిషేధించిన 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కల్గిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ఒకసారి వాడి పడేసిన 19 రకాల వస్తువులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి హితమైన వస్తువులు వాడాలని కోరారు. షాపులు ముందు రోడ్లపై చెత్త వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అలాగే కమిషనర్ ఉదయం సమయంలో రెండు, 29 వార్డుల్లో పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించారు. అన్నా క్యాంటీన్‌లో శుభ్రత, భోజనాల నాణ్యతను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తాం

భారతీయ బ్రాహ్మణ మహా సంఘం నేతలు



పంచాంగ కర్తలను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: బ్రాహ్మణ సామాజిక వర్గం అభ్యున్నతికి అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం కృషి చేస్తున్నట్టు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ గౌరవరం సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కాసు కల్చరల్ హాల్‌లో విద్వత్ సభలు, శ్రీగురు పురస్కారాలు- 2025 కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ దేశంలోని 20 రాష్ట్రాలలో కొనసాగుతున్న సంఘం కార్యకలాపాల ద్వారా బ్రాహ్మణ అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో అర్హతలను బట్టి అవకాశాలను కల్పిస్తున్నట్టు వివరించారు. మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రగంటి ప్రసాదశర్మ మాట్లాడుతూ, జాతీయ సంస్థగా మహా సంఘం సభలను రాష్ట్రంలో ఇప్పటి వరకు నాలుగు సభలు నిర్వహించి ఎందరికో సహాయం అందించామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా వివిధ రంగాలలో ప్రతిభ చాటిన బ్రాహ్మణులను శ్రీగురు పురస్కారాలతో సత్కరిస్తున్నామని వివరించారు. పండుగలను ఏకీకృతం చేసే దిశగా గత రెండేళ్లుగా వివిధ ప్రాంతాలలోని పంచాంగకర్తలను రప్పించి చర్చిస్తున్నట్టు తెలిపారు. రానున్న పరాభవ నామ సంవత్సరంలో అన్ని పండుగలను వివాదరహితంగా జరుపుకునేందుకు కృషి చేస్తున్నట్టు వివరించారు. శ్రీగురు పురస్కారాలు- 2025లో భాగంగా 80 మందిని ఘనంగా సత్కరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా శ్రీనివాసశర్మ, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటేనే రాణింపు



శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న షేక్ కరీం మొహిద్దీన్

నరసరావుపేట రూరల్: కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటేనే ఏ రంగంలో మోటివేషన్ స్పీకర్, సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ కె. శ్రీధర్‌బాబు తెలిపారు. ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మీ మనసులో ఏముందో, ఏం అనుకుంటున్నారో స్పష్టంగా, సమర్థవంతంగా చెప్పగలగడమే కమ్యూనికేషన్ స్కిల్ అని తెలిపారు. తమ అభిప్రాయాలు, ఆలోచనలు, భావాలను పంచుకోవడానికి కమ్యూనికేషన్ స్కిల్ ఉపయోగపడుతుందని తెలిపారు. సూటిగా, స్పష్టంగా, అవసరమైనప్పుడు కళాత్మకంగా మన భావాలు, ఆలోచనలు తెలియజేసే విధంగా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఉద్యోగ జీవితంలో కమ్యూనికేషన్ స్కిల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వినడం కూడా కమ్యూనికేషన్ స్కిల్ అని, ఎదుటవారు చెప్పేది శ్రద్ధగా వినడం ద్వారా అర్థం చేసుకుని సరైన సమాధానం ఇవ్వగల్గుతామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి షేక్ కరీం మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఈడీ షేక్ నజీమా, రోటరీ క్లబ్ కార్యదర్శి మునీందర్ రెడ్డి, డైరెక్టర్ పాశం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం అన్యాక్రాంతం కాలేదు

ఆర్డీవో మధులత



పాఠశాల భవనంపై కప్పును పరిశీలిస్తున్న ఆర్డీవో

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాల మరోసారి వివాదాస్పదంగా మారింది. పాఠశాల నిర్వహణలో ఉన్న స్థలాన్ని అన్యాక్రాంతం చేసి విక్రయించేందుకు యత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఏఈఎల్‌సీ సంస్థ ప్రతినిధులు ఇటీవల జిల్లా ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు నరసరావుపేట ఆర్డీవో మధులత మంగళవారం పాఠశాల వద్దకు చేరుకొని క్షేత్రస్థాయి విచారణ చేశారు. పాఠశాల భవనం, పైకప్పు, పరిసరాలు, భూమి రికార్డులను పరిశీలించి పాఠశాల స్థలం ఎటువంటి అన్యాక్రాంతం కాలేదని చెప్పారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఆర్డీవో మధులత పాఠశాల భవనం నిర్మించిన దాతల వంశీయులు, పాఠశాల పూర్వ విద్యార్థుల అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో ఎల్ చంద్రకళ, డీఐఈవో ఎస్ఎం సుభాని, తహసీల్దార్ జె.విజయశ్రీ, ఆర్ఐ సుబ్బారావు, సర్వేయరు గేరా సురేంద్రనాథ్, ఎంపీడీవో వి హేమలతాదేవి, ఎంఈవో ఎంవీ నాగరత్నం స్థానికులు ఉన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

రొంపిచర్ల: వరినారుమళ్ల సాగులో విత్తనశుద్ధి తప్పనిసరని మండల వ్యవసాయ అధికారి శివలలిత రైతులకు సూచించారు. విప్పర్లపల్లి, వడ్లమూడి వారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు.